క్లుప్తంగా

నేడు 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 25న స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజీంద్రన్ ఆదివారం తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న స్పందనలో డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చన్నారు. ప్రజలు అందించిన అర్జీలను నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమల్లో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



గంపలగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14,17 విభాగాల్లో త్వరలో నిర్వహించనున్న జిల్లా స్థాయి బాలబాలిక ఆటల పోటీకి గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బీ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు బీ రాంబాబు తెలిపారు. తిరువూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కబడ్డీ, ఖో-ఖో, త్రోబాల్, వాలీబాల్ ఆటల్లో ప్రతిభ చూపినందులకు వీరు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని హెచ్‌ఎం అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్‌లో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న 10వ బ్యాచ్ పాఠశాల హెచ్‌ఎంల శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. పాఠశాల నాయకత్వ శిక్షణ శిబిరంలో కోనసీమ, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన 213 మంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. దీనిలో స్వీయ క్రమశిక్షణ, అవగాహన, లక్ష్యాలను సాధించడంలో మన సామర్థ్యాన్ని పెంచుకోవడం, అభివృద్ధి మనస్తత్వాన్ని పెంచుకోవడం, అహింసాయుత సమాచారాన్ని ఉపయోగించి మన భావాలను ప్రసారం చేయడం, అధికార రహిత ప్రభావాన్ని చూపించడం, పాఠశాల భద్రత మొదలగు అంశాలపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణనిచ్చినట్లు సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ తెలిపారు. హీల్ పాఠశాల ఫౌండర్ కోనేరు సత్యప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు రోల్‌మోడల్‌గా ఉండాలని, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు హీల్ పాఠశాలకు అందించిన విరాళం రూ.2,01,116 స్వీకరిస్తూ, ఉపాధ్యాయులు పేద పిల్లలకు మరింత నాణ్యమైన విద్యను అందివ్వాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఏ భాస్కర్ కుమార్, కృష్ణాజిల్లా బాపులపాడు మండల ఎంఈఓ సురేషకుమార్, సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు మాధవీలత, సత్య కైవల్య సభ్యులు నీలిమ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



గంపలగూడెం: వినాయక చవిత ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా గంపలగూడెం గాంధీ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నవరాత్రి శిబిరం వద్ద చిన్నారులు ప్రదర్శించిన డ్యాన్స్ గ్రామస్తులను విశేషంగా అలరించింది. బాలబాలికలు ప్రత్యేక వేషధారణతో భక్తిభావం పెంపొందేలా డ్యాన్స్ నిర్వహించిన తీరు గ్రామస్తులను ఆకట్టుకొంది. 30 పాటలకు దేవతామూర్తుల వేషధారణతో చిన్నారులు చేసిన నృత్యం భక్తులను ఆకర్షించింది. సమరతసేవా సంఘం గంపలగూడెంశాఖ ప్రతినిధులు వనమా సుజాత, వనమా సత్యవాణి, నాగుబండి లావణ్య, నేర్ల హేమ, పసన్నలు యాకంరింగ్ చేశారు. మొదటి నాల్గు స్థానాల్లో ఉత్తమ ప్రతిభకనపర్చిన వారికి దేవిపవిత్ర గోల్డ్ అండ్ డైమండ్స్ సౌజన్యంతో రూ.2వేలు, రూ.1,500, రూ.వెయ్యిను అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ వాటర్‌బాటిల్స్‌ను కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

జై జై గణేశా.. బై బై గణేశా..

వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం జిల్లాలోని పలుచోట్ల గణనాథుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. 'జై జై గణేశా.. బై బై గణేశా.. జై బోలో మహరాజ్‌కీ జై' అంటూ వినాయకుడి విగ్రహాలను ఆయా గ్రామాలు, పట్టణాల్లో తొలుత ఊరేగించారు. నిమజ్జనోత్సవంలో ఉత్సవ నిర్వాహకులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గంపలగూడెంలో వినాయకుని ఊరేగిస్తున్న చిన్నారులు



మైలవరంలో నిమజ్జనానికి తరలి వెళుతున్న గణనాథుడి విగ్రహం

మైలవరం: మైలవరంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆదివారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. ఏడో రోజు ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మేళ తాళాలతో భక్తులు నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువత, చిన్నారులు ఆనందోత్సాహాలతో చిందులు వేస్తూ రంగులు చల్లుకున్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాలతో వైఎస్సార్ సీపీ నాయకులు విగ్రహాల ఏర్పాటు కమిటీలకు విరాళాలు అందజేశారు. స్థానిక బస్ స్టాండ్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి ఉమామహేశ్వరరావు గణపతి స్వామిని దర్శించుకున్నారు.

చిన్నారుల్లో భక్తిభావం

గంపలగూడెం: వినాయక చవితి సందర్భంగా గంపలగూడెంలో చిన్నారులు బుల్లి వినాయక విగ్రహాన్ని స్నేహితులతో కలిసి ఏర్పాటు చేసుకుని వారం రోజులు పూజలు నిర్వహించారు. ప్రతిరోజు సాయంత్రం దేవునికి నైవేద్యం సమర్పించి తాము కార్యక్రమం నిర్వహించేందుకు సహకరించిన వారందరికీ ప్రసాదాన్ని ఉత్సాహంగా పంపిణీ చేశారు. తమకే కాదు గ్రామస్తులకు, భరతజాతి మొత్తానికి మేలు జరగాలని కోరుకుంటూ పూజలు చేశారు. చివరగా ఆదివారం వినాయక విగ్రహాన్ని ఒక రిక్షాపై పెట్టుకుని, టపాసులు కాలుస్తూ గ్రామంలో ఊరేగించిన పిదప నల్లచెరువులో నిమజ్జనం చేసిన తీరు గ్రామస్తులను ఆకట్టుకొంది.

చాట్రాయిలో..

చాట్రాయి: గణపతి నవరాత్రులు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ముమ్మరంగా వినాయక నిమజ్జనాలు చేశారు. ఈ సందర్భంగా బూరుగుగూడెం, పర్వతాపురం గ్రామాల్లో అన్నదానం చేశారు. బూరుగుగూడెంలో ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నదానాన్ని ప్రారంభించి స్వామికి పూజలు నిర్వహించారు. నరశింహారావుపాలెం, సిగుడిపాడు, చనుబండ గ్రామాల్లో యువకులు రంగులు చల్లుతూ, టపాసులు పేల్చుతూ జోరుగా హుషారుగా వినాయక నిమజ్జనాల ఊరేగింపు నిర్వహించారు.



వలసపల్లి ఉత్సవాల్లో కమిటీ సభ్యులతో లడ్డూలు దక్కించుకున్న భక్తులు



బూరుగుగూడెంలో పూజలు చేస్తున్న దేశిరెడ్డి దంపతులు

కోలాహలంగా లడ్డూ వేలం

ముసునూరు: మండల వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయా గ్రామ వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణనాథులకు ఆదివారం పూజలు, లడ్డూల వేలం, అన్న సమారాధనలు, ఊరేగింపులు, విగ్రహాల నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. వలసపల్లిలోని సుప్రసిద్ధ కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన, 10 కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా, గ్రామ ప్రముఖుడు చలసాని ఉదయభాస్కర్ రూ. 63 వేలకు దక్కించుకున్నారు. ఒక కిలో లడ్డూను చలసాని రవి కుమార్ రూ.24,500 దక్కించుకున్నారు. ఇప్పటి వరకూ నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన లడ్డూ వేలంలో అత్యధిక ధర పలికిన లడ్డూలు ఇవే. గణనాథుడికి అర్చన చేసిన 10 కిలోల ఫలాలకు వేలం నిర్వహించగా మోరంపూడి రవి రూ.2,416 దక్కించుకున్నారు. అనంతరం సర్పంచ్ దామోదర్, ఉపసర్పంచ్ డీవీ సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మురళి, కమిటీ పెద్దలు దేవినేని శ్రీధర్, పాటిబండ్ల శ్రీరామమూర్తి కమిటీ సభ్యులతో కలిసి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుడి విగ్రహాన్ని ఊరేగించి స్థానిక నల్లచెరువులో నిమజ్జనం చేశారు.

అన్నదానం

విస్సన్నపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని నవరాత్రుల మండపం వద్ద ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.రక్షణనిధి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ నాగమల్లేశ్వరీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివబాజీ, పట్టణ అధ్యక్షుడు ఎన్‌వీ కుటుంబరావు పాల్గొన్నారు.



వలసపల్లిలో రూ.63 వేలు పలికిన లడ్డూ ఇదే

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలం ముచ్చనపల్లిలో వినాయక చవితి వేడుకలు ఆదివారం నిర్వహించారు. జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి పాల్గొని పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సర్పంచ్ దేవళ్ల జమలయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మద్దిరెడ్డి జమలారెడ్డి, తమ్మక్క తిరుపతిరావు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల వద్ద అన్నదానం

నూజివీడు: వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి నవరాత్రులను నిర్వహిస్తున్న పట్టణంలోని పలు గణేశ్ మండపాల వద్ద ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక ఎంప్లాయిస్ కాలనీలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ నేతృత్వంలోని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలోని ఆదివారం స్వామికి ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నూజివీడు పీఏసీఎస్ అధ్యక్షుడు బొబ్బిలి సాయిబాబు, మాజీ కౌన్సిలర్ కంచర్ల లవకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బసవరాజు నగేష్, పల్లే రవీంద్రరెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని బొందిలీపేట, రైతుబజారు రోడ్డులోని గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.



ఎంప్లాయిస్ కాలనీలో అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి

ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: వినాయకుని కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. విస్సన్నపేట పంచాయతీ పరిధిలో పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రులు పందిళ్లవద్ద ఎమ్మెల్యే ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బందులదొడ్డి వీధి, ఆర్యవైశ్య కల్యాణ మండపం, చింతకుంట, ఎన్టీఆర్ కాలనీ, కొత్తపేట, శివాలయం వడ్డెర్ల సంఘం, దాసాంజనేయస్వామి ఆలయం వద్ద, తిరుపతమ్మ పేట వద్ద, ముదిరాజులు, కుక్కలవారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని నవరాత్రులు పందిళ్ల వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.
కార్యక్రమంలో విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్య రాణీ, సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివబాజీ, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో వినాయకుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

ముసునూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం విజయవంతం చేయాలని వైద్యాధికారులు కరీముల్లా, కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని చెక్కపల్లిలో ఆదివారం చేపట్టిన గ్రామ స్థాయి సర్వేను డా. కరీముల్లా పర్యవేక్షించి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల షెడ్యూలును విడుదల చేశారు. ఈనెల 30న వేల్పుచర్ల, అక్టోబర్ 3న అక్కిరెడ్డి గూడెం, 4న చెక్కపల్లి, 5న లోపూడి, 6న సూరేపల్లి, 7న బలివే, 9న చింతలవల్లి, 10న గోపవరం-1, 11న గోపవరం-2, 12న కాట్రేనిపాడు, 13న కొర్లగుంట, 17న గుళ్లపూడి, 19న వలసపల్లి, 20న ముసునూరు-1 గ్రామాల సచివాలయాల పరిధిలో క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ క్యాంపుల నిర్వహణకు రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీమ్-1లో ఎంపీడీఓ జి.రాణి, డీటీ ఎమిలీ కుమారి, టీమ్-2 లో తహసీల్దార్ దాసరి సుధ, ఈఓపీఆర్డీ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రతాప్, అవినాష్‌తో పాటు మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

చాట్రాయిలో..

చాట్రాయి: పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం ఇంటింటా ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో 18,485 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 1,097 కుటుంబాల్లో సర్వే చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఇంట్లో ఉన్న వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని నమోదు చేస్తున్నారు. ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న వైద్య శిబిరాల్లో రోగులకు వైద్య సేవలు అందించనున్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విజయవాడ, గుంటూరు ఆస్పత్రులకు వైద్యులు రిఫర్ చేయనున్నారు.

తిరువూరులో..

తిరువూరు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఆదివారం పలు వార్డుల్లో నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించడంతో పాటు రక్త పోటు, మధుమేహం, రక్తహీనత, దగ్గు, కంటి సమస్యలు, జ్వరం తదితర సమస్యలతో బాధపడేవారి డేటా యాప్‌లో నమోదు చేశారు. అక్టోబరు 13న తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసే ప్రత్యేక వైద్య శిబిరంలో కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేస్తారని ఆరోగ్య సిబ్బంది తెలియజేశారు.



చెక్కపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పర్యవేక్షిస్తున్న డా.కరీముల్లా



బూరుగుగూడెంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

వైభవంగా గణపతి కల్యాణం



తిరువూరు ఎస్ఆర్ టవర్స్ సెంటర్లో గణపతి కల్యాణం



తిరువూరు మండలం అక్కపాలెంలో విఘ్నేశ్వర కల్యాణం

తిరువూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తిరువూరు మండలంలో ఆదివారం సిద్ధిబుద్ధి సమేత గణపతి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరువూరు షిర్డిసాయి మందిరం, బెందడు బజారు, ఎస్ఆర్‌టవర్స్ సెంటర్, అక్కపాలెం కోదండ రామాలయాల్లో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణం జరిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాజుపేట బెందడు రోడ్డులో అన్నదానం చేశారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వేల్పుచర్ల(ముసునూరు): విపత్తుల వేళ, స్వచ్ఛందంగా కదలి, తమ దాతృత్వం చాటుతూ స్వగ్రామంలో పేదలకు, అండగా నిలవడం అభినందనీయమని వేల్పుచర్ల ఎంపీటీసీ సభ్యుడు గరికిముక్కు సుబ్బారావు అన్నారు. ఇటీవల గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన గడ్డం తిరుపతిరావు కుటుంబ సభ్యులను గ్రామ ఉద్యోగులు, యువకులు ఆపన్న హస్తాన్ని అందించి ఆదుకున్నారు. అగ్ని ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న గ్రామానికి చెందిన, జిల్లాలోని భీమడోలు దేవి ఆస్పత్రి అధినేత, ప్రముఖ వైద్యుడు గురివింద గుంట బాబూరావు, వేర్వేరు ప్రదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు, స్థానిక అంబేడ్కర్ యూత్ సభ్యులు తమ సొంత నిధుల నుంచి సుమారు రూ.50 వేల సాయం ఆదివారం అందజేశారు.

అలరించిన ఆపాత మధురాలు

విజయవాడకల్చరల్: స్వరఝరి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన ఆపాత మధురాలు, భక్తి గీతాల కార్యక్రమం అలరించింది. ఒంగోలుకు చెందిన తాళ్లూరి శ్రీదేవి ఆధ్వర్యంలో అంజిబాబు, డి.కోటేశ్వరరావు అశోక్ ,బాలాజీ, పూర్ణచంద్రరావు, రంగనాథం అంజుస్వామి, పద్మశ్రీలు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, జేసుదాసు ఆలపించిన గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాల్సిన అవసరముందన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు పేరుతో జిల్లాలో ఆడిటోరియం నిర్మించడానికి కృషి చేస్తున్నామన్నారు. స్వరఝరి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం పేరుతో సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు



భక్తి గీతాలను ఆలపిస్తున్న గాయకులు

గణనాథునికి నృత్య నీరాజనం



విజయవాడకల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల సందర్భంగా సీతారామా కల్యాణ మండపంలో ఆదివారం నాట్యాచారిణి యల్లా జోస్యుల అనూరాధ బృందంలోని చిన్నారలు ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. శ్రీ గణనాథం, మోదక హస్తతో పాటు అన్నమయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. ఉదయం సేవా సంఘ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి దశరథ రమేష్, కార్యదర్శి అనుముల సోమశేఖర్, కమిటీ సభ్యులు డాక్టర్ గురునాథ్ శర్మ,గణపతి మూర్తి, మహిళా కార్యదర్శులు దుర్గాసావిత్రి, శిరీష పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): నేటి యువతరం అన్ని రంగాల్లో రాణించాలంటే చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం పొందాలని గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మోగులూరి ఎలిషా అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ కిట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. అమెరికా నుంచి వచ్చిన బ్రదర్ రాదణ్, లిండ్సే యువకులతో ఆటలు ఆడి ప్రోత్సహించారు. కార్యక్రమంలో సంస్థ పెద్దలు మోగులూరి అబ్రహాం, అనిల్, నాగరాజు, మోజస్ పాల్గొన్నారు.

కోనేరు సత్యప్రసాద్‌కు విద్యారత్న పురస్కారం



నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్‌కు విద్యారత్న పురస్కారం అందుకున్నారు. పద్మవిభూషణ్, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో తోటపల్లిలోని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్ విద్యారత్న పురస్కారాన్ని ముఖ్యఅతిథి పాటిబండ్ల దక్షిణామూర్తి చేతుల మీదుగా అందుకున్నారు. హీల్ సంస్థను 1993లో ప్రారంభించి, గుంటూరులోని చోడవరంలో ఒక బాలల ఆశ్రమం, తోటపల్లిలో బాలల ఆశ్రమంతో పాటు, అంధుల పాఠశాల, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలో 400 మంది రోజువారీ కూలీల పిల్లలకు ఉచిత ఇంగ్లిష్ మీడియం విద్యనందించడం తదితర సేవా కార్యక్రమాల ద్వారా వేలాది మంది అనాథలు, అభాగ్యులకు విద్యా, వసతి, వైద్య సదుపాయాలను కలుగజేస్తున్నందుకు ఈ అవార్డుకు సత్యప్రసాద్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, అధ్యక్షుడు వెన్నం మురళి, ఉపాధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి కొండబోలు రవి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రతతో వ్యాధులు దూరం



నూజివీడు: సమాజంలోని ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా జీవించవచ్చని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో 17వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్స్ ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్స్ సామాజిక బాధ్యతలో భాగంగా విద్యార్థులను, ప్రజలను పలు అంశాలపై చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యాధులు దరిచేరకుండా ఉంటే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండి ఉత్పాదకశక్తి పెరిగి దేశం ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. ట్రిపుల్ ఐటీ ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు చెత్తను తొలగించడంపై డైరెక్టర్, అధ్యాపకులు క్యాడెట్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఓ సీహెచ్‌వీ నవీన్‌కుమార్, 4వ ఆంధ్రా బెటాలియన్ ట్రిపుల్ ఐటీ ఏఎన్‌ఓ సుబ్బులక్ష్మి, డీఎస్‌డబ్ల్యూఓ వెంకటరావు, సీఎస్ఈ హెచ్‌ఓడీ చిరంజీవి పాల్గొన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

మైలవరం: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో గొల్లపూడి ఆంధ్ర హాస్పిటల్ నిర్వాహకులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో అత్యాధునిక పరికరములతో 2-డి ఎకో పరీక్షలు, వెబ్ బేస్డ్ ఈసీజీ, కిడ్నీ స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ ఫిజియోథెరపిస్టు డాక్టర్ సీహెచ్ నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత ఫిజియోథెరపీ కూడా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు),
99122 20544 (నూజివీడు),
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com